
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



'ఉపాధి' ఊతం

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉపాధి హామీ నిధులతో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. IIలో ▸



కార్తీకం.. మద్ది క్షేత్రం

కార్తీక మాసోత్సవాలకు మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. వచ్చేనెల 2 నుంచి క్షేత్రంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. IIలో ▸



పశు కిసాన్ క్రెడిట్ కార్డులు

పశు పోషణపై ఆధారపడిన పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. IIలో ▸

ఫీజుల భారం.. చదువుకు దూరం

చదువు 'కొనేదెలా'..!

- విద్యకు కొరవడిన ప్రభుత్వ సహకారం
- పత్తాలేని 'తల్లికి వందనం'
- విద్యా, వసతి దీవెనల ఊసెత్తని వైనం
- ఫీజుల చెల్లింపునకు తల్లిదండ్రుల అవస్థలు
- జగన్ ప్రభుత్వంలో పథకాలతో తోడ్పాటు



సాక్షి, భీమవరం: తల్లికి వందనంపై స్పష్టత లేదు.. విద్యా, వసతి దీవెనల ఊసెత్తడం లేదు.. ప్రభుత్వ నుంచి సాయం కొరవడటంతో ఫీజుల భారంతో పేద, మధ్యతరగతి వర్గాలు అవస్థలు పడుతున్నాయి. జిల్లాలోని 1,340 ప్రభుత్వ పాఠశాలల్లో 98,899 మంది విద్యార్థులు ఉండగా, దాదాపు 563 ప్రైవేట్ విద్యాసంస్థల్లో 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో పేదవర్గాల వారు 70 శాతం మంది వరకు ఉంటారని అంచనా. గత జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి, విద్యా, వసతి దీవెన తదితర పథకాల ద్వారా తోడ్పాటు ఇవ్వడంతో పిల్లల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు కృషిచేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల వారు ప్రభుత్వ సాయానికి తమ రెక్కల కష్టం జోడించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పిల్లలను చదివిస్తున్నారు.

సాయం అందక.. దిక్కుతోచక..

తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇంటిలో ఎందరు పిల్లలుంటే అందరికీ సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. ఈ మేరకు జిల్లాలో 1,74,763 మంది విద్యార్థులకు ఈ ఏడాది రూ.15 వేల చొప్పున రూ.262 కోట్ల సాయం అందించాల్సి ఉంటుందని అంచనా. విద్యా సంవత్సరం మొదలై ఇప్పటికే ఐదు నెలలు కావస్తుండగా.. మరో ఐదు నెలల్లో ముగియనుంది. ఇప్పటికీ తల్లికి వందనం పథకాన్ని ఎప్పటి నుంచి అమలుచేసేది, అలాగే మార్గదర్శకాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తోంది. సెకండ్ టర్మ్ ఫీజులు చెల్లించాలంటూ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి ఒత్తిడి వస్తుండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో అప్పుల బాట పడుతున్నారు.

రూ.138.8 కోట్ల మేర దీవెనల బకాయిలు

జిల్లాలో పాత బకాయిలు, ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను 31,412 మంది విద్యార్థులకు సంబంధించి రూ.138.8 కోట్ల మేర విద్యా, వసతి దీవెన పథకాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఆయా పథకాల పేర్లు మార్చిన ప్రభుత్వం నిధుల విడుదలకు చర్యలు తీసుకోకపోవడంతో కళాశాలలకు ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు తిప్పలు పడాల్సి వస్తోంది.

గత ప్రభుత్వంలో చదువుల విప్లవం

విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా అమ్మఒడి పథకం ప్రవేశపెట్టి అమలుచేశారు. ఏడాదికి రూ.15 వేల చొప్పున జిల్లాలోని 1,48,342 మంది తల్లుల ఖాతాలకు రూ.887.9 కోట్లు జమ చేశారు. పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల ఫీజులను జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా చెల్లించడంతో పాటు బస్సు చార్జీలు, హాస్టల్ తదితర ఖర్చుల నిమిత్తం జగనన్న వసతి దీవెన పథకం కింద ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున ఏడాదికి రెండు విడతల్లో సాయం అందించారు. గత ప్రభుత్వంలో జిల్లాలోని 1,77,996 మంది విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద రూ.485.33 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం కింద 1,76,142 మందికి రూ.163.41 కోట్లు సాయం అందింది. సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి నిర్ణీత సమయాల్లో సాయం అందించడంతో తల్లిదండ్రులకు ఫీజుల బెంగ తప్పింది. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో ఫీజుల భారం పడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. త్వరితగతిన తల్లికి వందనం, బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో ప్రభుత్వ సాయం

పథకం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
అమ్మఒడి	1,48,342	887.90
విద్యా దీవెన	1,77,996	485.33
వసతి దీవెన	1,76,142	163.41

అప్పు చేసి ఫీజు కట్టాను



గత మూడేళ్లుగా జగన్ పుణ్యమా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మా అమ్మాయిని డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ కళాశాలలో బీఎస్సీ చదివించుకోగలిగా. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో నాలుగో ఏడాది ఫీజు రూ.31 వేలు చెల్లించాల్సి వచ్చింది. డబ్బులు లేక అప్పు చేసి ఫీజు కట్టాను.

– బొల్లా దుర్గాప్రసాద్, తణుకు

'తల్లికి వందనం' ఎప్పుడో..



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తయినా తల్లికి వందనం పథకంపై స్పష్టత లేదు. నా కుమార్తె ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. తల్లికి వందనం వస్తే స్కూల్ ఫీజు చెల్లించడానికి అవకాశం ఉండేది. ఈ పథకం రాకపోవడంతో ఫీజుకు తిప్పలు పడ్డాను.

– కోరుకొల్లు వెంకట్రావు, కంచుమర్రు, అత్తిలి మండలం

ఇలా అయితే ఎలా ?



ఒక్కరికి కాదు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ తల్లికి వందనం పథకం ఇస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. ఇప్పటికీ ఒక్కరికి కూడా తల్లికి వందనం పథకం పేరున డబ్బులు పడలేదు. నాలుగు నెలల నుంచి చూస్తున్నాం. స్కూళ్లలో పిల్లల ఫీజులు కట్టే వరకూ ఒత్తిడి తెస్తున్నారు. ఇలా అయితే పిల్లలను ఎలా చదవించుకోగలం.

– బలే మార్తమ్మ, మొగల్లు, పాలకోడేరు మండలం

న్యూస్‌రీల్

బస్సుల్లో చోరీలపై అప్రమత్తం



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య అన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ బస్సుల్లో చోరీలు అధికమయ్యాయని, కొందరు మహిళలు తోటి ప్రయాణికుల మాదిరి బస్సులో చేరి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను చాకచక్యంగా దొంగిలిస్తున్నారన్నారు. ఇలా చోరీలకు పాల్పడిన మహిళల ఫొటోల పోస్టర్లను ఆర్టీసీ బస్‌స్టాండ్ల వద్ద ఏర్పాటుచేయడంతో పాటు వాటిని డ్రైవర్లు, కండక్టర్ల వాట్సాప్‌లకు పంపిస్తామన్నారు. అనుమానిత మహిళలు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు, రూరల్ సీఐ బి.శ్రీనివాస్, వన్‌టౌన్ ఎస్సై డి.కిరణ్‌కుమార్, రూరల్ ఎస్సై వీర్రాజు పాల్గొన్నారు.

డీఆర్వోగా వెంకటేశ్వర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావును నెల్లూరు జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎం.వెంకటేశ్వర్లును పశ్చిమగోదావరి జిల్లా డీఆర్వోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఏలూరు డీఆర్వోగా విశ్వేశ్వరరావు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ వి.విశ్వేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పుష్పమణిని బదిలీ చేసి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

తాడేపల్లిగూడెం ఆర్డీఓ బదిలీ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఆర్డీఓ వై.భవానీ శంకరీ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం ఆమె చిత్తూరు జిల్లా నగరి ఆర్డీఓగా వెళ్లారు. ఖతీబ్ కౌసర్ భానో తాడేపల్లిగూడెం ఆర్డీఓగా రానున్నారు.

డీఈఓగా నారాయణ



భీమవరం: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఈవీవీఎస్ఎస్ఎస్ బీఎల్ నారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం డీవైఈఓగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లాకు బదిలీ చేసింది. ఆయన గతంలో జిల్లా పరీక్షల విభాగ సహాయ కమిషనర్‌గా పనిచేశారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి డీఈఓగా ఆర్జేడీ జి.నాగమణి పనిచేశారు.

పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను త్వరగా అప్‌డేట్ చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు జెడ్పీ సీఈఓ సుబ్బారావుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. తమ సంఘ అభ్యర్థన మేరకు జిల్లాలోని ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలను నవీనపరిచి స్టేట్‌మెంట్లను ఇచ్చినందుకు సీఈఓకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, ఉపాధ్యక్షుడు డీకేఎస్ఎస్ ప్రకాశరావు, ఏలూరు రూరల్ అధ్యక్షుడు రామశేషు కుమార్, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాస్, పెదవేగి మండల నాయకులు వీరంకు శ్రీనివాస్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

చేపల అక్రమ పట్టుబడిపై కలెక్టర్ ఆరా

సాక్షి స్పందన

కైకలూరు: లీజు నిబంధనలకు విరుద్ధంగా కైకలూరు కరకట్ట వద్ద 112.26 ఎకరాల చేపల చెరువులో చేపల అక్రమ పట్టుబడిపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆరా తీశారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయాలపై 'కూటమి నేతల దౌర్జన్యం' శీర్షికన గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఆమె స్పందిస్తూ కైకలూరు రెవెన్యూ అధికారులను పూర్తి నివేదికను కోరారు. లీజుదారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివరాలు, కొద్దిరోజులుగా చెరువు వద్ద జరిగిన వాస్తవ పరిస్థితిని రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదించినట్టు తెలిసింది.

సమష్టిగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ నాగరాణి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేసి ఈనెల 31 నాటికి ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ఈనెల 21న ప్రారంభం కాగా వచ్చేనెల 29తో ముగుస్తుందన్నారు. జిల్లాలో 112 సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా వాటిలో 98 మేజర్ ఇరిగేషన్, 14 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయన్నారు. ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో 98 డబ్ల్యూయుఏలకు 12 మంది చొప్పున, 14 డబ్ల్యూయుఏలకు 6 మంది చొప్పున మొత్తంగా 1,260 మంది సభ్యులు ఉంటారన్నారు. ఈనెల 31లోపు ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా సిద్ధం చేసి ఆదేరోజు ప్రకటిస్తామన్నారు. వచ్చేనెల 1, 2 తేదీల్లో అభ్యంతరాల ప్రకటన, 3న అభ్యంతరాల పరిష్కారం, అనంతరం తుది ప్రకటన విడుదల చేస్తామన్నారు. వచ్చేనెల 20న నీటి వినియోగదారుల సంఘాలకు, నీటి పంపిణీ కమిటీ ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తామని, 21 నుంచి 23 మధ్య నీటి సంఘాలకు, 24 నుంచి 26 మధ్య నీటి పంపిణీ సంఘాలకు, 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంతో ప్రాణరక్షణ

జిల్లా ఎస్పీ శివకిషోర్

ద్వారకాతిరుమల: ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే.. అతడి కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై గురువారం వినూత్న రీతిలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన వాహనాన్ని చూపుతూ అనర్థాలను వివరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా భార్య, పిల్లలతో బైక్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని ఆపి హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పించి, ఆ దంపతులకు ఎస్పీ స్వయంగా హెల్మెట్లను అందించారు. కుటుంబ సభ్యులు, పిల్లలు ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో వారు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సురక్షితమైన ప్రయాణం చేయాలని, రహదారి నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించడంతో పాటు హెల్మెట్ ఉపయోగాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు ఇన్‌స్పెక్టర్ యూజే విల్సన్, ద్వారకాతిరుమల, భీమడోలు ఎస్సైలు టి.సుధీర్, సుధాకర్, జిల్లా ట్రాఫిక్ రికార్డు బ్యూరో కానిస్టేబుల్ మధు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులకు హెల్మెట్లు అందిస్తున్న జిల్లా ఎస్పీ శివకిషోర్

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

భీమవరం: జిల్లాలో సార్వా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో సార్వా ధాన్యం కొనుగోలుపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయిస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతు సహాయక కేంద్రాల్లో 25 శాతం గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను రైస్ మిల్లుల వద్ద వెహికల్ మానిటరింగ్ అధికారులుగా నియమిస్తున్నామన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఆర్డీఓలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, వై.భవాని శంకరి, సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామకృష్ణ, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రీ సర్వే చేసినప్పుడు భూయజమానులను భూమి వద్దకు పిలిపిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రీ సర్వేపై సమీక్షించారు. రీ సర్వే గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు 87 గ్రామాల్లో గ్రామ సభల ద్వారా వచ్చిన 1,847 దరఖాస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన గ్రామాల్లో నెలాఖరు నాటికి గ్రామసభలు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో 174 గ్రామాల్లో రీ సర్వే పూర్తిచేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీఓలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వై.భవాని శంకరి, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ విచారణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) లంక వెంకటేశ్వరరావు విచారణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌రెడ్డి వీలునామకు రూ.1,000 తీసుకుంటున్నారని ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టామన్నారు. విచారణ పూర్తిచేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి జిల్లాలో పశుగణన

భీమవరం(ప్రకాశం చౌక్): అఖిల భారత పశుగణన సర్వేను జిల్లాలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పశుగణన మాన్యువల్ బుక్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 వరకు పశుగణన నిర్వహిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం దోహదపడుతుందన్నారు. జిల్లాలోని 20 మండలాలకు 248 ఎన్యుమరేటర్లు, 41 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామని, పశుగణన ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.కె.మురళీకృష్ణ, సహాయ సంచాలకులు నోయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యం మరచి.. రైతులను ఏమార్చి..

- మళ్లీ ధాన్యం మిల్లులకే..
- అన్నదాతలకు తప్పని తిప్పలు
- 12.040 టన్నుల కొనుగోళ్లు
- 48 గంటల్లో నగదు జమచేస్తామన్న ఇన్‌చార్జి మంత్రి
- మూడు రోజులు గడిచినా నో పేమెంట్
- గత ప్రభుత్వంలో నేరుగా రైతుల వద్దే కొనుగోళ్లు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: దళారుల బారిన పడకుండా.. మిల్లర్ల బారిన పడకుండా ధాన్యం పండించిన రైతులు సంతోషంగా నిర్ణీత సమయంలో సొమ్ములు తీసుకునే పరిస్థితులను గత ప్రభుత్వం కల్పించింది. నేరుగా ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టి ఐదేళ్లపాటు ఇబ్బందులు లేకుండా చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో మిల్లర్లను తెరపైకి తెచ్చి అన్నదాతల కష్టాన్ని మిల్లర్లు రేటు నిర్ణయించేలా చేస్తున్నారు. రైతులే ఏ మిల్లుకైనా తరలించుకోవచ్చని ప్రకటించడం ద్వారా మిల్లర్ల కనుసన్నల్లో కొనుగోళ్లు జరుగనున్నాయి. మంగళవారం ఏలూరు జిల్లాలో 250 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల్లో 12.040 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అది కూడా ఉంగుటూరులోని చేబ్రోలులో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా, మిగిలిన కేంద్రాలన్నీ ఆన్‌లైన్‌లో ప్రారంభమైనా ధాన్యం కొనుగోళ్లు చేపట్టలేదు.

2.30 లక్షల ఎకరాల్లో..

ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది అకాల వర్షాలు, తుపానుల దాటికి మూడు సార్లు పంట నష్టం వాటిల్లింది. ధాన్యం దిగుబడి ఆశించినంత రాకపోయినా విక్రయించుకునేందుకు అవకాశం లభించింది. గత ఐదేళ్లలో అధికారులు కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మిల్లర్ల మోసాలకు రైతులు ఇబ్బందులు పడకుండా ర్యాండమ్‌గా మిల్లులను ఎంపిక చేసి ధాన్యాన్ని పంపించేవారు. అయితే ప్రస్తుతం కూటమి సర్కారు ఈ విధానానికి చెక్ పెట్టింది. రైతులు నేరుగా ఏ మిల్లుకు అయినా తరలించుకోవచ్చంటూ ఆదేశాలు జారీ చేసింది. తద్వారా మిల్లర్లే అందిన కాడికి రైతుల వద్ద కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇలా పరోక్షంగా ధాన్యం కొనుగోలు నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

5.60 లక్షల టన్నుల అంచనా:

ఏలూరు జిల్లాలో 5.60 లక్షల టన్నుల దిగుబడి అంచనా కాగా.. పౌరసరఫరాల శాఖ 3.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. వాస్తవానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈనెల 15 నాటికి ప్రారంభించాల్సి ఉన్నా మంత్రి కార్యక్రమం ఖరారు కావడంతో ఆలస్యమైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 48 గంటల్లో నగదు జమ చేస్తామని బలంగా చెప్పారు. మూడు రోజులు గడిచినా ఆ దిశగా జిల్లాలో చర్యలు లేవు.

చాలీచాలని గోనె సంచులు

జిల్లాలో 15 లక్షల గోనె సంచులు అవసరం కాగా.. సగం మేరకే అందుబాటులో ఉన్నాయి. వాటిలో కూడా చినిగిన గోనె సంచులు ఎక్కువగా ఉన్నాయి. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా రైతులకు సేవలందించేవారు. అయితే రైతు భరోసా కేంద్రాల సేవలకు కూటమి సర్కారు కక్ష కట్టి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంది. గతంలో ఒక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ వరి కళ్లాల్లోనే ఉంటూ రైతులకు ధాన్యం విక్రయించే వరకూ సూచనలు, సలహాలు అందించేవారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 250 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెబుతున్నా వాటిలో ఎవరిని నియమించారు, ఎవరు కొనుగోలు చేస్తారన్న విషయాలపై స్పష్టత లేదు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ టెలికాం సంస్థలు టారిఫ్‌లను భారీగా పెంచడంతో అనూహ్యంగా పుంజుకున్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత చేరువయ్యే దిశగా చర్యలను చేపట్టినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. కొత్త బ్రాండ్ లోగోతో కనెక్టింగ్ భారత్, సెక్యూర్డ్, అఫ్రోడబిల్డీ, రిలయబులీ నినాదంతో ముందుకొచ్చామన్నారు. కొత్త లోగోను ఇటీవల కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆవిష్కరించినట్టు చెప్పారు. అలాగే స్పామ్ ఫ్రీ నెట్‌వర్క్, వైఫై రోమింగ్, డైరెక్ట్ టు డివైజ్ కనెక్టివిటీ సేవల్ని ప్రారంభించామన్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాలో విస్తృత సేవలందిస్తామని జీఎం శ్రీను వివరించారు.

ఎయిడెడ్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లిలో పీఎంకే ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఎయిడెడ్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించినట్టు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 29లోపు ధ్రువీకరణ పత్రాల జెరాక్సులతో పాఠశాల కరస్పాండెంట్‌కు పోస్టు ద్వారా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

క్లుప్తంగా

భీమవరంలో నటుడు కిరణ్ అబ్బవరం సందడి



భీమవరం: నటుడు కిరణ్ అబ్బవరం భీమవరంలో సందడి చేశారు. 'క' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం పట్టణంలోని నాయుడు గారి కుండ బిర్యానీ హోటల్లో ఆయన అభిమానులతో మాట్లాడారు. భీమవరంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, తన మొదటి షార్ట్ ఫిలిమ్ 'ఓ మనసా ఇటు రావే' ఇక్కడే చిత్రీకరించినట్లు గుర్తు చేశారు. ఎస్ఆర్ కళ్యాణ మండపం సినిమా రిలీజ్ సందర్భంగా సంక్రాంతి వేడుకల్లో ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు చూపించే ఆదరణ ఎప్పటికీ మరవలేనన్నారు. ఈనెల 31న 'క' చిత్రం విడుదలవుతుందన్నారు. 1977లోని కథ ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం తప్పక విజయం సాధిస్తుందని కిరణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుగారి కుండ బిర్యానీ ఫౌండర్ వరనాయుడు మాట్లాడుతూ 'క' చిత్రం వీక్షించిన ప్రేక్షకులు సినిమా టికెట్ తీసుకునివస్తే తమవద్ద ఉచితంగా బిర్యానీ పొందవచ్చునన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పెంటపాడు: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెంటపాడు ఎస్సై స్వామి గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో సంతబజార్ ప్రాంతంలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో నిందితుడు బీరువాలోని బంగారు, వెండి వస్తువులు అపహరించుకొనిపోయాడు. దీనిపై బాధితులు పెంటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో చోరీకి పాల్పడింది భీమవరంనకు చెందిన జువ్వల అశోక్‌కుమార్‌గా గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.80 వేల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

6 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీలు

ఏలూరు రూరల్: నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకూ విజయవాడ, మంగళగిరి, గుంటూరులో ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ఆటల పోటీలు జరగనున్నాయని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 29, 30వ తేదీల్లో ఏలూరులో అల్లూరి సీతారామరాజుస్టేడియం, ఇండోర్ స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. 29వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో సెలక్షన్లు జరుగుతాయన్నారు. 30వ తేదీన హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌పే జట్లు ఎంపిక చేపడతామన్నారు. వివరాలకు 9866317326నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కొల్లేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కైకలూరు: కొల్లేరులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం పందిరిపల్లిగూడెంకు చెందిన ఘంటసాల అంతర్వేది(38) చేపల వేటతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం చేపల వేటకు వెళ్లిన కొల్లేరులో గల్లంతయ్యాడు. అతని మృతదేహం కొల్లేరులో బొల్తాపడిన పడవ వద్ద గురువారం లభించింది. వీఆర్వో రాజరత్నం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కైకలూరు తరలించారు.

కార్తీకం.. మద్దిక్షేత్రం

- అనేక ప్రత్యేకతలకు నిలయం మద్ది ఆంజనేయస్వామి ఆలయం
- మద్ది వృక్షమే ఆలయ శిఖరం
- కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ హనుమాన్ క్షేత్రంగా విరాజిల్లుతున్న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానం కార్తీక మాస ఉత్సవాలకు ముస్తాబవుతోంది. నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల రోజుల పాటు మద్ది క్షేత్రంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. కార్తీక మాసంలో అనేక జిల్లాల నుంచి లక్షల్లో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లు, వైద్య శిబిరాలు, అన్నసమారాధన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల కార్యక్రమాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు.

కార్తీక ఉత్సవాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలు

- నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ 1న సువర్చలా హనుమద్ కల్యాణాలు
- 8, 15, 18, 25 తేదీల్లో స్వామి వారికి లక్ష తమలపాకులతో పూజలు
- 6, 13, 20, 27 తేదీల్లో లక్షపుష్పాలతో పూజలు
- 27వ తేదీన సాయత్రం 7 గంటలకు పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవం
- నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు హనుమాన్ మండల దీక్షల స్వీకరణ
- డిసెంబర్ 13న హనుమద్ వ్రతం
- డిసెంబర్ 15న హనుమాన్ దీక్షల విరమణలు, మహాపూర్ణాహుతి



క్షేత్ర విశిష్టత

ప్రకృతి అందాల నడుమ ఎర్రకాలువ ఒడ్డున శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో భక్తులను అటు ఆధ్యాత్మికంగా గాను, ఇటు ఆహ్లాద భరితంగా ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ ఆలయానికి శిఖరం ఉండదు. మద్ది వృక్షమే ఆలయానికి శిఖరం. ఈక్షేత్రంలో 108 ప్రదక్షిణలకు ఒక ప్రత్యేకత ఉంది. పెళ్లికాని యువతీ యువకులు 7 మంగళవారాలు 108 ప్రదక్షిణలు చేస్తే తమ కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం. శబరిమలలో అయ్యప్పస్వామి వారి మాలలకు ఎంత ప్రాధాన్యత ఉందో, ఉభయ తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా హనుమాన్ దీక్షల స్వీకరణ, ఇరుముడుల సమర్పణకు మద్దిక్షేత్రానికి అంత ప్రాధాన్యత ఉంది. హనుమాన్ దీక్షలు ఆచరించిన భక్తులు మద్దిక్షేత్రంలో ఇరుముడులు సమర్పిస్తుంటారు. సినీ, రాజకీయ నాయకులకు మద్ది అంజన్న ఒక సెంటిమెంట్ దేవుడు. ఇప్పటికే అగ్రహీరోల నుంచి అనేక మంది నటీనటులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎన్నికల సమయాల్లో పోటీలో నిలిచే అభ్యర్థులు తమ నామినేషన్ల పత్రాలను స్వామివారి పాదల చెంత ఉంచి తర్వాత నామినేషన్లు వేస్తుంటారు. ఈ క్షేత్రంలో వివాహాలు కూడా అధికంగా జరుగుతుంటాయి. ఇక్కడకు వచ్చే భక్తులకు క్షేత్రంలోని సింధూర వృక్షాలు కనువిందు చేస్తుంటాయి. క్షేత్రంలో నిత్యాన్నదానం కొనసాగుతుంది.



ప్రకృతి అందాల నడుమ ఎర్రకాలువ ఒడ్డున మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం

ఎలా వెళ్లాలంటే..

- ఏలూరు నుంచి తడికలపూడి మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకొని అక్కడి నుంచి గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకోవచ్చు. దూరం: 55 కిలోమీటర్లు.
- తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల వారు నల్లజర్ల, కొయ్యలగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకుని అక్కడ నుంచి గురవాయిగూడెం చేరుకోవచ్చు. దూరం: 50 కిలోమీటర్లు.
- కొవ్వూరు పరిసర ప్రాంతాల వారు దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం అక్కడ నుంచి గురవాయిగూడెం చేరుకోవచ్చు. దూరం 55 కిలోమీటర్లు.
- ద్వారకాతిరుమల నుంచి తూర్పు యడవల్లి మీదుగా గురవాయిగూడెం చేరుకోవచ్చు దూరం: 25 కిలోమీటర్లు.

అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం



కార్తీక మాసంలో క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇందుకోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం.
– ఆర్‌వీ చందన, సహాయ కమిషనర్, మద్దిక్షేత్రం

దర్శన వేళలు

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7.30 గంటల వరకు స్వామి వారి దర్శనం కల్పిస్తారు. ప్రతి మంగళవారం వేకువజాము 5 గంటల నుంచి స్వామి వారి దర్శనం ఉంటుంది.

బెల్ట్ షాపులు, అక్రమ మద్యం అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బెల్టు షాపులు, అక్రమ మద్యం తక్షణం అరికట్టాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం బెజవాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కల్లు గీత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ కారణంగా ఈ వారం రోజుల్లోనే రాష్ట్రంలో 20 వేలకు పైగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిసినట్లు తెలుస్తుందని, వీటికి తోడు అక్రమ మద్యం పరవళ్లు తొక్కితే కల్లు దుకాణాలు మూత పడే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. మన పొరుగు రాష్ట్రాలు కల్లు గీతను అన్ని రకాల ఆదుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కల్లు అనేది లేకుండా చేయాలనుకోవడం నాలుగు లక్షల గీత కుటుంబాలకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా నూతన కల్లు పాలసీ ప్రకటించి వృత్తిలో ఉపాధి పెంచేలా చూడాలన్నారు. గీచేవానికే చెట్టుపై ఉన్న హక్కు యథావిధిగా అమలు చేయాలని, వృత్తిలో మరణించిన వారి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియో, మరణించిన వారి దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయపడినవారి వైద్య ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని, మారుతున్న పరిస్థితుల అనుగుణంగా గీత వృత్తిని ఆధునికరించాలని, కల్లుని శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు బొక్కా చంటి, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు, ఏలూరు సొసైటీ అధ్యక్షుడు తోళం సత్యనారాయణ, పరసా పోతురాజు, మరీదు తులసీరావు, బెజవాడ మోహన్‌రావు, బెజవాడ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ఉసురు తీసిన రోడ్డు గుంతలు



దొంగపాలెం వద్ద రోడ్డుపై భారీ గోతులు



ప్రదీప్ మృతదేహం

పెనుగొండ: పెనుగొండ మండలం దొంగరావిపాలెం టోకు మార్కెట్ సమీపంలో రోడ్డు గుంతలు ఓ వ్యక్తి ఉసురు తీశాయి. వివరాల ప్రకారం వీరవాసరం మండల వడ్డిగూడెంకు చెందిన సైదు ప్రదీప్‌కుమార్(30) బుధవారం ఉదయం కిర్లంపూడి మండలం ఎస్ తిమ్మాపురంలోని తన అన్నయ్య అనారోగ్యానికి గురి కావడంతో చూడడానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగివస్తుండగా దొంగరావిపాలెం వద్ద ఉన్న భారీ గోతుల్లో మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కూలిపని చేసుకొని జీవించే ప్రదీప్‌కు భార్య, కుమార్తె, కుమారుడు సంతానం. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధర్ గురువారం విలేకర్లకు తెలిపారు.

పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు

- తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణాలు
- చిన్న చిన్న అవసరాలను తీర్చుకోవడానికి వెసులుబాటు
- ఏలూరు జిల్లాలో 14,629 కార్డులు ఇవ్వాలని లక్ష్యం



నూజివీడు : వరిగడ్డి కొనుగోలు చేయాలన్నా.. పశువుల షెడ్డుకు మరమ్మతులు చేయించుకోవాలన్నా.. పశువుల దాణా కొనుగోలు చేయాలన్నా.. కొత్తగేదెను కొనాలన్నా.. పశుపోషకుల చేతిలో డబ్బులు ఉండాల్సిందే. అయితే చాలా మంది రైతులు సకాలంలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటారు. రూ.10 వేలు కావాలన్నా అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో పశు పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు శ్రీకారం చుట్టింది. ఈ కార్డులున్న పాడి రైతులు తమకు సొమ్ము కావలసినప్పుడు బ్యాంకులకు వెళ్లి రుణాలను తీసుకొని ఆర్థిక అవసరాలను తీర్చుకోవచ్చు.

రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు

పశు కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకున్న పశు పోషకులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా 7 శాతం వడ్డీ రేటుపై రూ.1.60 లక్షల రుణాన్ని బ్యాంకులు ఇస్తాయి. పూచీకత్తుతో అయితే గరిష్టంగా రూ.3 లక్షల వరకు రుణాన్ని ఇస్తాయి. వీటిని తిరిగి సక్రమంగా చెల్లించినట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో మూడు శాతం రాయితీ పోను ఒక శాతం మాత్రమే వడ్డీ పడుతుంది. సక్రమంగా కార్డులను వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండా ఆర్థిక అవసరాలను తీర్చుకోవచ్చు. ఎవరి వద్దా అప్పులు చేయాల్సిన పనిలేదు. ఒకసారి సక్రమంగా తిరిగి చెల్లించినట్లయితే బ్యాంకర్లే రుణం ఇచ్చేందుకు ముందుకు వస్తాయి. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయొచ్చు. రుణాలు ఇవ్వాలంటే పశు పోషకుడికి పశువులు ఉన్నట్లుగా పశువైద్యాధికారి సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 14,629 కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నూజివీడు డివిజన్‌లో 6,429 కార్డుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు 5,202 కార్డుల జారీకి పశుపోషకులు దరఖాస్తు చేసుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పశుపోషకులు ఈ కార్డును తీసుకోవడం ద్వారా వారి ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. గరిష్టంగా రూ.3 లక్షల వరకు రుణం అందిస్తాం. అధిక వడ్డీల భారం ఉండదు కాబట్టి రుణాల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదం ఉండదు. ఈ కార్డులు పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి.
– కే చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ, నూజివీడు

గెలిపించినవారే టీడీపీని ఓడిస్తారు

జనసేన నేత కరాటం రాంబాబు హెచ్చరిక

జంగారెడ్డిగూడెం: సరైన ప్రాతినిధ్యం కల్పించకపోతే గెలిపించినవారే టీడీపీని ఓడిస్తారని మాజీ డీసీసీబీ చైర్మన్, జనసేన నాయకుడు కరాటం రాంబాబు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జనసేన చింతలపూడి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. టీడీపీ నాయకులు జనసేన పార్టీ పట్ల వివక్షతతో వ్యవహరిస్తున్నారని, ఎన్నికల ముందు ఉన్నట్లుగా వారు ఎన్నికల అనంతరం ఉండటం లేదని ఏకరువు పెట్టారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ పటిష్టంగా ఉండేలా ఇప్పటినుంచే అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కృషిచేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కరాటం రాంబాబు మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలు తనకు అర్థమవుతున్నాయన్నారు. ఒక గ్రామమే కాదు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ జనసేన కేడర్‌కు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని తెలుస్తుందన్నారు. కూటమి విజయానికి ముఖ్య పాత్ర పోషించింది జనసేనే అని, సమస్యలను గుర్తించి తొందరగా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఓటమికి కూడా అదే కారణం కావచ్చని ఆయన హెచ్చరించారు. గెలిపించిన వాళ్లు ఓడించగలరు కూడా కదా అని కరాటం అన్నారు. ఈ సమస్యను సమన్వయం చేయాల్సింది పార్టీ మండల అధ్యక్షులు, ఇన్‌చార్జులు మాత్రమే అని, న్యాయం జరిగే వరకూ తాను కార్యకర్తల వైపే ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గురుజు ఉమా, మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల రాకేశ్, జంగారెడ్డిగూడెం కౌన్సిలర్ వలవల తాతాజీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ పీరు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో జనసేన సమావేశంలో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

మోటారు సైకిళ్ల దొంగల అరెస్ట్

19 మోటారు సైకిళ్లు స్వాధీనం



ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీ శివకిషోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: మోటార్‌సైకిళ్లు చోరీ చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసులు పట్టుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కళ్యాణ్, బీమిరెడ్డి సీతారామిరెడ్డి, దూళ్ళ కొత్తూరు గ్రామనాకి చెందిన ధనికొండ రమేష్ అనే ముగ్గురు ముఠాగా ఏర్పడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరంతా నూజివీడు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో -6, ఏ.కొండూరు -1, బందరు తాలూకా పీఎస్-1, మైలవరం పీఎస్-2, తిరువూరు పీఎస్-1, ఒంగోలు 1 టౌన్ పీఎస్-1, కృష్ణలంక పీఎస్-2, సత్తుపల్లి పీఎస్-1, చింతలపూడి పీఎస్-1, ఇతర ప్రాంతాల్లో మరో 3 మోటారు సైకిళ్లను చోరీ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా సరిహద్దుల్లో అనుమానిత వ్యక్తుల కదలికలపై నూజివీడు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ చేస్తూ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, 19 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల అదుపునకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని, చోరీ సొత్తు రికవరీలో కూడా ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. 2024 జూలై నుంచి అక్టోబర్ వరకూ ఆయా కేసుల్లో చోరీ సొత్తును రూ.కోటి 93 లక్షల 13 వేల 892 రికవరీ చేశామన్నారు. 2023 ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరంలో భారీగా రికవరీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్, నూజివీడు కేవీబీఎస్‌వీ ప్రసాద్, నూజివీడు సీఐ సత్యశ్రీనివాస్, ఎస్సై జ్యోతిబసు ఉన్నారు.

ఉద్యాన పంటలకు 'ఉపాధి' ఊతం

- పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం
- ఉపాధి హామీ నిధులతో రాయితీ
- జిల్లాలో 3,150 ఎకరాల్లో సాగు లక్ష్యం
- సన్న, చిన్నకారు రైతులందరికీ అవకాశం

నూజివీడు: సన్న, చిన్నకారు రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉపాధి హామీ నిధులతో పండ్లతోటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. దీనిలో భాగంగా వందశాతం రాయితీతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను సైతం ఇస్తుంది. మెట్ట ప్రాంతంలో పండ్లతోటల సాగును పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధిహామీలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను అమలు చేస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. మెట్టభూముల్లో పండ్ల తోటలను సాగు చేయించడంతో పాటు రైతులకు నిర్వహణ ఖర్చులను కూడా చెల్లిస్తోంది. అందులో భాగంగా ఏలూరు జిల్లాలో 3,150 ఎకరాల్లో ఉద్యాన తోటలు అభివృద్ధి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) లక్ష్యంగా నిర్దేశించింది. ఈ పథకంలో ఆయిల్‌పామ్, మామిడి, జామ, తైవాన్ జామ, సీతాఫలం, సపోటా, జీడీ మామిడి, కొబ్బరి, మల్లె, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్ తదితర తోటల సాగుకు సైతం అనుమతి ఇచ్చారు.

రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే

2006–07లో ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. అన్ని కులాలకు చెందిన 5 ఎకరాల లోపు మెట్ట లేదా 2.5 ఎకరాల మాగాణి భూమి ఉన్న రైతులు అర్హులు.



నీటి వసతి లేకపోయినా

పండ్ల తోటల సాగుకు నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు. మెట్ట భూముల్లో పండ్లతోటలను సాగు చేసి అభివృద్ధి చేసుకోవచ్చు. పొలం పరిసరాల్లో చెరువు, కాలువ, పెర్కులేషన్ ట్యాంక్ ఉంటే సరిపోతుంది. ఎండాకాలం కూడా నీటిని పెట్టుకునే సదుపాయం ఉంటే సరిపోతుంది. ఉపాధి హామీ జాబ్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేల స్వభావాన్ని బట్టి పండ్ల తోటల ఎంపిక

ఎర్ర, ఇసుక నేలల్లో – మామిడి, ఇసుక, ఎర్రగరప తేలికపాటి నేలల్లో – జీడిమామిడి, నీరు నిలవని ఎర్ర గరప, తేలికపాటి నల్ల నేలల్లో – బత్తాయి, ఒండ్రు నేలల్లో – నాటు జామ, ఇసుకమట్టి, ఒండ్రు, మధ్యరకం నల్ల నేలల్లో – సపోటా, ఒండ్రు, ఏ నేలలోనైనా – తైవాన్ జామ, ఇసుక నేలల్లో – కొబ్బరి, ఎర్ర ఇసుక, ఒండ్రు నేలల్లో – ఆయిల్‌పామ్, అన్ని రకాల నేలల్లో – దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, సేంద్రియం అధికంగా ఉండే తేలికపాటి నేలల్లో – గులాబీ, ఎర్ర, ఇసుక నేలల్లో – మునగ పంటలను సాగు చేసుకోవచ్చు. ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఉపాధిహామీ పథకంలో సాగు చేసిన పండ్ల తోటలకు మూడేళ్ల పాటు పనిదినాలను బట్టి నిర్వహణ నిధులను విడుదల చేస్తారు. నాటిన మొక్కల్లో తొలి ఏడాదిలో కనీసం 50 శాతం పైన మొక్కలు బతికించుకున్న రైతులకు ప్రతినెలా నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుంది. పూల తోటలకు మాత్రం రెండేళ్ల పాటు మాత్రమే నిర్వహణ ఖర్చులు ఇస్తారు. పండ్ల తోటలను డిసెంబరు వరకు నాటుకోవచ్చు.

పండ్ల తోటల సాగులో ఎకరాకు చెల్లించే రాయితీ వివరాలు

పండ్లతోటల రకం	మూడేళ్లలో చెల్లించే మొత్తం
మామిడి	రూ.1,03,204
జీడీ మామిడి	రూ.92,947
బత్తాయి	రూ.1,29,941
నాటు జామ	రూ.1,34,751
తైవాన్ జామ	రూ.2,30,023
సపోటా	రూ.1,15,209
కొబ్బరి	రూ.92,896
ఆయిల్‌పామ్	రూ.51,200
సీతాఫలం	రూ.2,22,688
దానిమ్మ	రూ.2,20,862
నేరేడు	రూ.60,256
ఆపిల్ బేర్	రూ.1,14,824
డ్రాగన్ ఫ్రూట్	రూ.1,84,760
గులాబీ	రూ.2,07,540
మల్లె	రూ.2,07,540
మునగ	రూ.1,32,744

క్లుప్తంగా

ఖాళీ స్థలాలు బాగుచేయకుంటే చర్యలు



లయన్స్ క్లబ్ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: మునిసిపాలిటీ పరిధిలో ఇళ్ల మధ్య ఇతర ప్రాంతాలలో ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేసుకోవాలని కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు పెరగడం వల్ల దోమల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. ఇలాంటి ప్రాంతాలు ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తాయని, స్థలాలు శుభ్రం చేయకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లయన్స్‌క్లబ్ సౌజన్యంతో వీకర్స్‌కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు గురువారం ఫ్రిజ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఏసుబాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, అడిషనల్ కోంటమ్ పునరుద్ధరణ చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లింపులు, కొత్త పీఆర్‌సీ వచ్చేలోపు 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కార్యాలయంలో ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. హరికుమార్ మాట్లాడుతూ కమ్యూటేషన్ ఆఫ్ పెన్షనర్స్ రికవరీ కాలపరిమితి తగ్గించాలని కోరారు.ఈ సమావేశంలో కె.బాలకృష్ణ, వైవీ సత్యనారాయణ మూర్తి, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, ముస్తాఫా, దాసం నాగేశ్వరరావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



గంబూషియా చేపలను విడుదల చేస్తున్న సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని కడకట్ల, కొండయ్య చెరువు, డీఎస్ చెరువు, నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలలో గంబూషియా చేపలను వదిలారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ సోమేశ్వరరావు, వార్డు ఇంచార్జ్ పి.రాజేశ్వరీ, శానిటేషన్ కార్యకర్తలు, ఆశాలు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు

అత్తిలి: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం అఖండ అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గమళ్లపాడుకు చెందిన హరే శ్రీనివాస్ భక్త బృందం అన్నసమారాధనలో పాల్గొని తమ సేవలను అందజేశారు.

ప్రజాదర్బార్‌లో 300 వినతులు

తణుకు: తణుకు పట్టణంలోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొని ప్రజలను వినతులను స్వీకరించారు. మొత్తం 300 అర్జీలు వచ్చాయని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలి ఆరోపణలో తొమ్మిది మందిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఒక కుటుంబానికి చెందిన వారిని అదే సామాజిక వర్గానికి చెందిన వారు వెలి ఆరోపణలు విదితమే. ఈ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిది మందిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ.. లేనట్టేనా?

- ఖరీఫ్ ముగుస్తున్నా అందని పెట్టుబడి సాయం
- జగనన్న పాలనలో ఠంచన్‌గా రైతు భరోసా
- నేడు ఆ ఊసే ఎత్తని కూటమి సర్కారు



ఇటీవల నాట్లు దెబ్బతినడంతో వ్యవసాయాధికారులను నష్టపరిహారం అడుగుతున్న రైతన్నలు (ఫైల్)

పెంటపాడు: రైతులకు కూటమి పాలనలో ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఏడాదికి రూ. 20 వేలు అందజేస్తామని హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు రైతులకు మొండిచేయి చూపారు. గత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చారే తప్ప సాయం మాత్రం అందజేయలేదు. జులై 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు అనుకూలంగానే కురిసాయి. అయితే నారుమడుల సమయంలోనూ, నాట్ల సమయంలోనూ కురిసిన వర్షాలు రైతులకు ఉపయోగపడ్డాయి. అయితే దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్న సామెత చందంగా కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురౌతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలివిడత సాయంగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమచేసింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఊసేలేదు. మే నెలలోనే రైతు భరోసా నగదు రూ. 5500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్తా ఆగిపోయింది. ప్రస్తుతం కేంద్రం అందజేసిన పీఎం కిసాన్ నగదు కూలీల ఖర్చులకు ఉపయోగపడింది. ఇంకా దుక్కిలు, ఎరువులు, విత్తనాలు, ఊడ్పులు కోసం రైతులకు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే రైతుకు సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ. 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతు భరోసా పథకంలో రూ. 7500 కలిసి ఏటా రూ. 13500 చొప్పున మూడు విడతలుగా రైతులకు జగనన్న ప్రభుత్వం అందించేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని రైతులు చెప్పుకొంటున్నారు. దీంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమయం దాటితే ఉపయోగం ఉండదు



గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ఖరీఫ్ పంట ప్రారంభంలోనే అందేది. ఈ సాయం రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ జరుగుతున్న ఇంత వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. రైతులు వడ్డీలకు సొమ్ములు తెచ్చి సార్వా పెట్టుబడులు పెడుతున్నారు. సమయానికి కూటమి ఇస్తానన్న సాయం రూ. 20 వేలు ఇస్తే బాగుంటుంది. వెంటనే సాయం అందించాలి.

– దేవరశెట్టి రాంబాబు, బి. కొండేపాడు, కౌలురైతు

స్కేటింగ్‌లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



స్కేటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు అర్బన్: ఆర్ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటి బంగారు పతకాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో ఏలూరు నిర్వహించిన ఈ పోటీల్లో 5 నుంచి 7 వయస్సు కేటగిరీలో 3 బంగారు, 2వెండి, 2 కాంస్య, 7 నుంచి 9 వయస్సు కేటగిరీలో 1 బంగారు, 3 వెండి, 5 కాంస్య, 9 నుంచి 11 వయస్సు కేటగిరీలో 1 బంగారు, 3 వెండి, 1 కాంస్య, 11 నుంచి 14 వయస్సు కేటగిరీలో 1 వెండి, 3 కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యతోపాటు క్రీడల్లోను విద్యార్థులు ముందు వరసలో ఉండాలని డైరెక్టర్ ప్రకాశరావు అన్నారు. క్రీడలు మంచి క్రమశిక్షణ, మానసిక ఉల్లాసాన్ని కలగచేస్తాయని స్పష్టం చేశారు. పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు వారిని తీర్చిదిద్దిన స్కేటింగ్ కోచ్ ఎ.భార్గవ్‌ను అభినందించారు.

అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి పరామర్శ



అత్తిలిలో యిర్రి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అత్తిలిలో యిర్రి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల యిర్రి సత్యనారాయణ సోదరి ముత్యాల పోలేశ్వరి మృతి చెందారు. గురువారం అత్తిలిలో యిర్రి సత్యనారాయణ గృహానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వారికి మనోధైర్యాన్ని కలిగించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్లపల్లి మణికుమార్, రామిశెట్టి రాము, యడ్లపల్లి దుర్గారావు తదితరులు ఉన్నారు.

పోలియో నివారణకు రోటరీ సంస్థ కృషి అభినందనీయం



పోలియో నివారణ అవగాహనా ర్యాలీ దృశ్యం

తణుకు టౌన్: ప్రపంచ వ్యాప్తంగా పోలియో నివారణకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, రోటరీ సంస్థల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. గురువారం ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలియో రహిత సమాజానికి రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈసందర్భంగా తణుకులోని ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి తణుకు మున్సిపల్ కార్యాలయం వరకూ పోలియో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు, కార్యదర్శి కఠారి సిద్దార్థ, సీహెచ్ వెంకటేశ్వరరావు, వై బాబూరావు, జేఎస్ సుబ్రహ్మణ్యం, గమిని రాంబాబు, పుట్టా సత్యనారాయణలతో పాటు తణుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్‌లు, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న మహా విజ్ఞాపన దీక్ష విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోనాల బీమారావు

తణుకు టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్ల సొమ్ములు చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 28న విజయవాడలో జరుపతలపెట్టిన మహా విజ్ఞాపన దీక్ష విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం తణుకు సురాజ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సుమారు 10.50 లక్షల మందికి రూ. 3,080 కోట్లు చెల్లించాలన్నారు. డిపాజిట్ దారులకు న్యాయం జరిగే విధంగా సమర్థవంతమైన అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 28న విజయవాడలో జరిగే మహా విజ్ఞాపన దీక్షలో బాధితులు, ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా విభాగం కార్యదర్శి వై.నాగలక్ష్మి, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, అసోసియేషన్ నాయకులు ఎస్.రామ శ్రీను, పి.శ్రీనివాస్, జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరావు, పి.అమ్మిరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరికి మహాయాగ మహోత్సవ ఆహ్వానం



తణుకులో మహాయాగ మహోత్సవ ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు శివారు పాలంగిలో నిర్వహించనున్న శ్రీచండీ మహారుద్ర, పూర్వక కోటి దీపోత్సవ, కోటి కుంకుమార్చన సహిత మహాయాగ సోమయాగానికి హాజరుకావాల్సిందిగా మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు యాగ నిర్వాహకులు ఆహ్వానించారు. నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలంగి రోడ్డులోని భిమిడి సూరన్న లేఅవుట్‌లో వచ్చేనెల 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఈ యాగమహోత్సవానికి హాజరుకావాల్సిందిగా వారు కోరారు. పదిహేనురోజులపాటు ఏకబిగిన నిర్వహించే మహా యాగోత్సవంలో 13 పాసుపత రుద్రాభిషేకాలు, కోటి కుంకుమపూజలు, చండీ పారాయణాలు, సహస్రదీపాలంకరణతోపాటు ప్రతిరోజూ శివ కల్యాణం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ లోకకల్యాణార్థం నిర్వహించే ఈ మహా యాగోత్సవం తణుకు ప్రాంతంలో నిర్వహించడం శుభ సూచకమని, ప్రజలంతా సుఖసౌఖ్యాలతో తులతూగాలనే ఉద్దేశ్యంతో చేసే ఈ యాగ నిర్వహణ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా యాగ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను కారుమూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, చినిమిల్లి సాంబశివరావు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఆస్పత్రి వార్డులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: ఆసుపత్రి విధుల్లో సిబ్బంది అలక్ష్యం వహిస్తే అలాంటి వారిని సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు ఆదేశించారు. ఇటీవల ఏరియా ఆసుపత్రిలో జరిగిన గర్భిణీ ఘటనకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొక్కులు తీర్చుకోవాలని గుళ్లకు వెళ్లి కొబ్బరికాయ కొట్టి వస్తారు. కాని అనారోగ్యం వస్తే వైద్యులను దైవాలుగా వైద్యోనారాయణో హరి అంటూ వస్తారు. అలాంటి వారికి సేవలు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. గూడెం ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఈ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డయాలసిస్ కేంద్రంలో రెండు యంత్రాలు పనిచేయడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎవ్వరైనా విధుల్లో ఉన్న సమయంలో నిర్లక్ష్యం వహిస్తే వారిని సస్పెండ్ చేయాలని, అలా సస్పెండ్ చేసే అధికారం ఇక్కడ లేనప్పటికి ఉన్నతాధికారుల ద్వారా ఈ చర్యలు తీసుకొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెటర్నిటీ వార్డులో ప్రసవించిన స్త్రీలను అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ పి.సూర్యనారాయణ, ఆర్ఎంఓ తాతారావు, కూటమి నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు అర్బన్: రాజీకాదగ్గ కేసుల్లో పూర్తి శాస్వత పరిష్కారం పొందేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి కోరారు. తణుకు కోర్టులో గురువారం లోక్ అదాలత్‌లపై పలు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాల్లో కోర్టులు ఉన్న ప్రతి ప్రాంతంలోను జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని అందులో రాజీకాదగ్గ క్రిమినల్ కేసులతోపాటు చెక్ బౌన్స్, బ్యాంకు బకాయి, యాక్సిడెంట్స్, కుటుంబసభ్యులతో తగాదాలు, డీవీసీ గృహహింస, సివిల్, ప్రామిసరీ నోటు బకాయిలు, ప్రీలిటిగేషన్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కక్షిదారులు రాజీ పడడం ద్వారా తమ విలువైన డబ్బు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ కోర్టుల్లో ప్రిలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని, భార్యభర్తల తగాదాల కేసుల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏలూరు పర్మినెంట్ లోక్ అదాలత్ జడ్జి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా రాజీచేస్తున్నారని వివరించారు. కేసుల్లో ఇరువర్గాలు రాజీ పడే విషయంలో పోలీసులను, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

చాందినికి అభినందనలు

ఇరగవరం: రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు రేలంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డి చాందిని ఎంపికైంది. ఈనెల 23న ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో చాందిని అత్యుత్తమ ప్రతిభను చూపి జిల్లా టీంలో స్థానం సంపాదించుకుంది. 27 వతేదీ నుంచి 29 వరకు అన్నమయ్య జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థినీ, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఎస్ఆర్ అప్పారావు, వి సుమలతలను పాఠశాల హెచ్ఎం టి రవీంద్ర, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్ వెంకటేశ్వర రావు, పూర్వ విద్యార్థి చేగొండి హరి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ ఐక్యరాజ్య సమితి డే సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో గురువారం ఎల్‌బిసీ ప్రక్కన శ్రీ వాసవి జూనియర్, డిగ్రీ విద్యార్థులు, మార్కెట్ రోడ్డులోని జీఎంఆర్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిబేట్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్ జరిగాయి. మొదటి, రెండవ విజేతలకు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వీవీఎస్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చిన్నం జగదీష్, జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు, గరికపాటి బాపయ్య శర్మ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్లకు కొమరవరం విద్యార్థినుల ఎంపిక



అండర్ 14 జిల్లా బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తణుకు టౌన్: 23వ తేదీన ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14, అండర్ 17 బాలికల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలలో తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సాల వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినీలు అండర్ 14 విభాగంలో తంగెళ్ల అనూష, జంగా అనుపమ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా వచ్చే నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అలాగే అండర్ 17 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినీలు బొంత నికిత, తంగెళ్ల అనిషాలు జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకూ అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జట్లకు ఎంపికైన విద్యార్థినీలతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గజ్జవల్లి రవిలను పాఠశాల హెచ్ఎం వెంకటలక్ష్మీ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గర్భిణులు, బాలింతలు అయోడిన్ సాల్ట్‌ను వాడాలి



అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: గర్భిణులు, బాలింతలు అయోడిన్ సాల్ట్ మాత్రమే వాడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి తిరుపతిపురం సెక్టార్ శివపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అయోడిన్ సాల్ట్ తీసుకోని గర్భిణీలకు బుద్ధిమాంద్యంగల పిల్లలు జన్మిస్తారన్నారు. ఆహార పదార్థాలు వండేటప్పుడు వాటిని దించేటప్పుడు మాత్రమే సాల్ట్ వేయాలని, కూరల్లో ముందుగా ఉప్పు వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి మాధవి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పును తీసుకోవడం ద్వారా హైపోథైరాయిడ్, బుద్ధి మాంద్యత వంటివాటి బారిన పడకపోవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఆర్ సురేఖ అన్నారు. అత్తిలి రామాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయోడిన్ ఉప్పువాడకం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి తులసి, పద్మశ్రీ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను నియంత్రణకు ఎఫ్‌పీవో



మాట్లాడుతున్న చైర్మన్ కొండపల్లి నగేష్

తాడేపల్లిగూడెం రూరల్: దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) కృషి చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ కొండపల్లి నగేష్ అన్నారు. గురువారం మండలంలోని మాధవరం పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో ఎఫ్‌పీవో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ కృషి భారతి ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ నుంచి అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ఎఫ్‌పీవో డైరెక్టర్ పైడికొండల సింధు మాట్లాడుతూ రైతులకు ఎఫ్‌పీవో గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ,

కూటమి పాలనలో ప్రజలు నిరాశలో ఉన్నారు

ఏపీ అప్పడా మాజీ వైస్ చైర్మన్ రఘురాం

పెంటపాడు: కూటమి పాలనలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని ఏపీ అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు చెప్పారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ప్రజలు తీవ్రంగా దెబ్బతిన్నారన్నారు. వారిని ఆదుకోవాల్సింది పోయి, వైఎస్సార్ సీపీపై అభాండాలు వేయడం తగదన్నారు. ఈ చర్యలను ప్రజలు చూస్తూనే ఉన్నారని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, జగన్నాథపురం, ఆరుగొలను, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 33/11కేవీ పాతూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మినగర్ ఫీడర్‌కు, జెడ్పీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌లకు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫార నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. టీటీడీ కల్యాణ మండపం రోడ్డు ఏరియా, మహాలక్ష్మినగర్ రోడ్డు ఏరియా, తాడేపల్లి చెరువు ఏరియా, గుణ్ణం ఫంక్షన్ హాల్ రోడ్డు, పాతూరు, మసీద్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్‌ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటితో ముగియనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్

తాడేపల్లిగూడెం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణ పొందగోరు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నెల 25వ తేదితో దరఖాస్తు గడువు ముగియనున్నదని తాడేపల్లిగూడెం సహాయ, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి బి.రామాంజనేయ రాజు తెలిపారు. తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.